క్లుప్తంగా

ద్విచక్ర వాహనాల చోరీ

చేబ్రోలు: మండలంలో ఒకే రోజు రెండు ద్విచక్ర వాహనాలు చోరీకి గురయ్యాయి. నారాకోడూరుకు చెందిన గొట్టేటి గంగాధర రావు గార్మెంట్ షాపును నిర్వహిస్తున్నాడు. 17వ తేదీ సాయంత్రం షాపులో పని చేస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి పాత యమహా బైక్‌ను ముందు ఉంచాడు. అనంతరం రూ.లక్ష విలువ చేసే కొత్త బైక్‌ను అపహరించుకుపోయాడు. వాహనం తీసుకుని వెళ్లే సమయంలో గమనించి పట్టుకోవడానికి ప్రయత్నించినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. దీనిపై గంగాధరరావు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

● మంచాల గ్రామానికి చెందిన అన్నదాసు గంగాధరరావు ఎప్పటిలాగానే ద్విచక్ర వాహనాన్ని ఇంటి ముందు బుధవారం రాత్రి ఉంచాడు. గురువారం తెల్లవారుజామున చూసే సరికి మాయమైంది. పరిసర ప్రాంతాల్లో గాలించినప్పటికీ ఆచూకీ లభ్యం కాలేదు. దీనిపై బాధితుడు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

● రెండు రోజుల కిందట వడ్లమూడిలోనూ మోపెడ్ దొంగతనానికి గురైనట్లు తెలిసింది.

మనిషిలో మానసిక పరివర్తనే విజయానికి నాంది



గుంటూరు రూరల్: మనిషిలో మానసిక పరివర్తనే అతని విజయానికి నాంది అని వ్యక్తిత్వ వికాస నిపుణుడు ఈ.ఎస్. వాల్మీకి తెలిపారు. నగర శివారు లాం నందున్న చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మానవుడు తన మస్తిష్కంలో ఉన్న తప్పుడు ప్రోగ్రాంను రీ ప్రోగ్రాం చేయడం ద్వారా అద్భుత ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. స్వామి వివేకానంద, రామకృష్ణ పరమహంస వంటి ప్రసిద్ధ వ్యక్తుల్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. చంద్రశేఖర్, డాక్టర్ ఏ. రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు.

సంతాన లేమి సమస్యలకు ఉచిత వైద్య శిబిరం

డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్

గుంటూరు మెడికల్: సంతాన లేమి సమస్యతో బాధపడుతున్న వారికి తమ ఆసుపత్రిలో నవంబరు 12 వరకు ఉచితంగా కన్సల్టేషన్, అల్ట్రాసౌండ్ పరీక్షలు, కౌన్సెలింగ్, ఉచిత స్పెర్మ్ పరీక్షలు చేస్తున్నామని ప్రముఖ ఐవీఎఫ్ స్పెషాలిటీ వైద్య నిపుణుడు, అహల్య ఐవీఎఫ్ సెంటర్ అధినేత డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ తెలిపారు. స్థానిక కొత్తపేటలోని అహల్య ఐవీఎఫ్ సెంటర్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. గుంటూరు కొత్తపేట శివాలయం వెనుక ఉన్న అహల్య ఐవీఎఫ్ సెంటర్‌లో, విజయవాడ సీతారామపురం వారణాసి వీధిలోని అహల్య ఐవీఎఫ్ సెంటర్‌లో నెల రోజుల పాటు మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని తెలిపారు. సంతానం లేని దంపతులతో పాటు ప్రమాదవశాత్తు సంతానం కోల్పోయినవారు కూడా మెగా ఉచిత వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ఉచిత వైద్య శిబిరాలకు వచ్చే వారికి 50 శాతం రాయితీతో ఐవీఎఫ్ చికిత్సలు అందిస్తున్నామని స్పెషలిస్టు డాక్టర్ శనక్కాయల రాజకుమారి తెలిపారు. పూర్తి వివరాల కోసం 9848590244, 9908836169 నంబర్లను సంప్రదించాలని వారు కోరారు.

భార్యపై దాడి చేసిన భర్తపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: భార్యపై దాడి చేసిన భర్తపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బ్రాడీపేటలోని ఓ అపార్టుమెంట్ వాచ్‌మేన్‌గా పనిచేస్తున్న భర్త దేవీలాల్ నాయక్‌తో కెతావత్ కల్యాణి విభేదించి రెండు సంవత్సరాల కిందట విడిపోయింది. ఈనెల 13న దేవీలాల్ నాయక్ భార్య వద్దకు వచ్చి గొడవ పడి, కొట్టి దుర్భాషలాడాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం

వ్యక్తి అదృశ్యంపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. కొరిటిపాడుకు చెందిన కె.సునీల్‌కుమార్ ఈనెల 11న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ఎటో వెళ్లిపోయాడు. అతని ఆచూకీ కోసం వెతికిన కుటుంబ సభ్యులు కనిపించకుండా పోయినట్లు నిర్ధారించుకుని గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేతాజీనగర్‌లో మహిళ..

మహిళ అదృశ్యంపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. నేతాజీనగర్‌కు చెందిన ఓ మహిళ ఈనెల 18వ తేదీ ఇంట్లో ఎవరికి చెప్పకుండా ఎటో వెళ్లిపోయింది. వెతికినా ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజలంతా వైద్య సేవల్ని సద్వినియోగం చేసుకోవాలి



ఉప్పలపాడులో పేషెంట్ల రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ల జ్యోతి

పెదకాకాని: ప్రజలంతా జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య సేవల్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని ఉప్పలపాడులో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా తహసీల్దార్ పి. రత్నం, ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ల జ్యోతి, గ్రామ సర్పంచి కర్నాటి శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యురాలు జ్యోతి మాట్లాడుతూ ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలనే ధ్యేయంతో ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష అమలు చేస్తోందని తెలిపారు. శిబిరంలో డాక్టర్ సీహెచ్. విజయప్రకాష్, డాక్టర్ ప్రవీణదీప్తి, డాక్టర్ భవిష్య, డాక్టర్ శ్రీవిద్య 415 మందికి వైద్యసేవలు అందించారు. ఏర్పాట్లను పెదకాకాని పీహెచ్‌సీ సూపర్‌వైజర్ పి. శ్రీనివాసరావు పర్యవేక్షించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ బి.వి. మల్లేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, నాయకులు ముద్రబోయిన నాగేశ్వరరావు, పల్లెంపాటి శ్రీనివాసరావు, ఫ్రాన్సిస్, సచివాలయ ఉద్యోగులు, వైద్య సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలకు ఆరోగ్య రక్ష

గార్లపాడు(కాకుమాను): జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు పేద ప్రజలకు ఆరోగ్య రక్షగా మారాయని ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండలంలోని గార్లపాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీపీ శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలంతా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి శిబిరాల్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. జెడ్పీటీసీ సభ్యురాలు ముజావర్ షేక్ గుల్జార్ బేగం మాట్లాడుతూ దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలో చేపట్టనటువంటి అనేక సంక్షేమ పథకాలతో పాటు ప్రతి ఒక్కరికీ సంపూర్ణమైన ఆరోగ్యాన్ని అందించాలనే ఉద్దేశంతో గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. శిబిరాలలో ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా అనేక లక్షల మంది వైద్య పరీక్షలు నిర్వహించుకుని ఆరోగ్యంగా ఉన్నట్లు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి ముజావర్ షేక్ అసదుల్లా, పెద్ది మురళి, నిడుబ్రోలు సుబ్బారావు, గరికపాడు ఎంపీటీసీ సభ్యురాలు పిచ్చమ్మ, మండల ప్రత్యేకాధికారిణి తేళ్ల ప్రేమకుమారి, తహసీల్దార్ జె.ప్రసాదరావు,ఎంపీడీవో రామకృష్ణ పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజారోగ్యం సురక్షితం

గుంటూరు రూరల్: జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజారోగ్యం సురక్షితంగా ఉంటుందని రూరల్ మండలం జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మల సుబ్బారావు తెలిపారు. వెంగళాయపాలెం మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వైఎస్ ఎంపీపీ ఇంటూరి పద్మావతితో కలసి శిబిరంలో రోగుల రిజిస్ట్రేషన్, హెల్త్, మెడికల్, వైద్యుల కౌంటర్లను పరిశీలించారు. ప్రజలకు ఎటువంటి సమస్య వచ్చినా వారికి సకాలంలో వైద్య సేవలు సకాలంలో అందించాలని సిబ్బందికి సూచించారు. అర్హులైన వారికి మందులతో పాటు కళ్లజోళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు సుబ్బారావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వైద్యుల సలహాలను పాటించి, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. గ్రామంలో మొత్తం 528 మందికి గానూ 434 మంది సేవల్ని వినియోగించుకున్నట్లు చెప్పారు. ఇందులో స్త్రీల వ్యాధులు 22 మంది, కీళ్ల వ్యాధులు 93 మంది, సాధారణ సమస్యలు 151 మంది, కంటి వైద్య పరీక్షలు 168 మంది ఉన్నట్లు వివరించారు.కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ వజ్రశ్రీ , ఎంపీడీవో ఆదినారాయణ, సర్పంచ్ లలితకుమారి, ఈవోపీఆర్డీ కె. శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు కాకాని రమేష్, ఉడతా భూలక్ష్మి, దాసుపాలెం సర్పంచ్, జేసీఎస్ కన్వీనర్ ఎదురుపాక వెంకట్, సచివాలయ కన్వీనర్లు అద్దంకి ధర్మారావు, దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి, బుజ్జమ్మ, వెంకటరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు పెదకాకానిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం

పెదకాకాని: స్థానిక కాశీ గార్డెన్ స్కూలులో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు తెలిపారు. శిబిరంలో నిపుణులతో సాధారణ వ్యాధులతో పాటు కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. గ్రామస్తులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

రాష్ట్ర ప్రజల ఆరోగ్యానికి భద్రత



సభలో మాట్లాడుతున్న ఎంపీపీ పద్మలీల

పొన్నూరు: రాష్ట్ర ప్రజల ఆరోగ్యానికి భద్రత కల్పించేందుకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ బి.పద్మలీల సూచించారు. మండలంలోని పచ్చలతాడిపర్రు గ్రామ ఎంపీయూపీ పాఠశాలలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆమె సందర్శించి, వైద్య సేవల్ని పరిశీలించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోషకాహార ప్రదర్శనను సందర్శించి, అంగన్‌వాడీ కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన 310 మంది ప్రజలు వైద్య పరీక్షలు చేయించుకున్నారని ఎంపీడీవో ఏ. శ్రీనివాసరావు తెలిపారు. వారందరికీ ఉచితంగా మందులు అందించినట్లు ఆయన చెప్పారు. మెరుగైన చికిత్స అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ వైద్యశాలలో అందించే విధంగా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. మండలంలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి అపూర్వ స్పందన లభిస్తోందని తెలిపారు. శిబిరంలో డాక్టర్లు మహమ్మద్ హుస్సేన్, శాంతి, శ్యామల, నాగ సింధూర, రత్నకుమారి సేవలు అందించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఆశా కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



వెంగళాయపాలెంలో కిట్‌ను అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మల సుబ్బారావు, వైఎస్ ఎంపీపీ ఇంటూరి పద్మావతి తదితరులు



గార్లపాడులో కంటి పరీక్షలను పర్యవేక్షిస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

డేటా చౌర్యంపై అప్రమత్తత అవసరం



గుంటూరు రూరల్: డేటా చౌర్యంపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని లైఫ్యాక్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో జి. భరత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. చౌడవరంలోని కల్లం ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం సైబర్ సెక్యూరిటీపై విద్యార్థులకు ఏర్పాటు చేసిన వర్క్‌షాపులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలను అపరిచితులతో పంచుకోరాదని సూచించారు. ఫోన్లలో ఓటీపీతో పాటు పేటీఎం, ఫోన్‌పే, గూగుల్‌పేలను అప్‌డేట్ చేసుకునేటప్పుడు వచ్చే మెసేజ్‌ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఫోన్ నంబర్‌కు అనుసంధానమైన బ్యాంక్ ఖాతాకు సంబంధించిన వివరాలు గోప్యంగా ఉంచాలని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం. ఉమాశంకర్‌రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ బీఎస్‌బీ రెడ్డి, ఏవో కె. నవ్య, డాక్టర్ రాజీవ్‌జట్లన్ పాల్గొన్నారు.

చెరువులో ఈతకు వెళ్లి యువకుడి మృతి



పొన్నూరు: చెరువులో ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు.. పొన్నూరు పట్టణంలోని నిడుబ్రోలు ప్రాంతానికి చెందిన స్నేహితులైన నలుగురు యువకులు మండలంలోని ఆలూరు గ్రామ సమీపంలోని చెరువులో బుధవారం సాయంత్రం ఈతకు వెళ్లారు. చెరువు మధ్య భాగానికి వెళ్లిన గట్టు చిరంజీవి (22) ఈతరాని కారణంగా ప్రమాదవశాత్తు మునిగిపోయాడు. మిగిలిన ముగ్గురు యువకులు ఒడ్డుకు చేరుకొని గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. సంఘటన సమాచారం తెలుసుకున్న పొన్నూరు రూరల్ పోలీసులు గురువారం ఉదయం నుంచి గాలింపు చర్యలు చేపట్టారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో మృతదేహం లభ్యం కాగా, పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బేల్దారి పనులతో జీవనం సాగిస్తున్న చిరంజీవి మృతితో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది.

న్యూయార్క్ సొల్యూషన్స్‌తో చలపతి ఫార్మసీ కళాశాల ఎంవోయూ



పత్రాలను చూపుతున్న ప్రిన్సిపల్ రామారావు

గుంటూరు రూరల్: విద్యార్థుల్లో నైపుణ్యాల్ని పెంపొందిస్తూ ప్రత్యేక శిక్షణ కార్యక్రమాల్ని రూపొందించి పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా న్యూయార్క్ సొల్యూషన్స్ 3 ఎక్స్ పని చేస్తోందని చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు తెలిపారు. నగర శివారుల్లోని లాం నందున్న కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సొల్యూషన్ 3ఎక్స్ సంస్థతో ఒప్పందం ద్వారా కళాశాలలో విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. మెడికల్ కోడింగ్ వృత్తికి ఎంతో ప్రాధాన్యత ఉందని చెప్పారు. కార్పొరేట్ హాస్పిటల్స్, ఇన్స్యూరెన్స్ కంపెనీలు, ల్యాబ్స్, ఫార్మా కంపెనీల్లో ఉపాధి అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. అనంతరం సొల్యూషన్స్ 3 ఎక్స్ సంస్థ ప్రతినిధి సమీవుల్లా మహమ్మద్‌తో ఒప్పంద పత్రాల్ని మార్చుకున్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

శ్రీలలితా త్రిపుర సుందరీదేవిగా భక్తులకు అనుగ్రహం



పెదకాకాని శివాలయంలో శ్రీ లలితా త్రిపుర సుందరీదేవిగా శ్రీ భ్రమరాంబ అమ్మవారు



నవరాత్రి ఉత్సవాల్లో మంత్రి అంబటి రాంబాబును సన్మానిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

పెదకాకాని: శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో దసరా నవరాత్రోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఐదో రోజు గురువారం అమ్మవారు శ్రీ లలితా త్రిపుర సుందరీదేవిగా భక్తులను అనుగ్రహించారు.తెల్లవారుజామున ఐదు గంటలకు సుప్రభాతసేవ, హారతులతో పూజలు ప్రారంభమయ్యాయి. ఉదయం 10 గంటలకు విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, పంచగవ్యం, నవావరణ పూజలు జరిగాయి. అనంతరం అర్చకులు ఉభయ దాతలతో పూజలు జరిపించారు. సాయంత్రం 5 గంటలకు శ్రీ భ్రమరాంబ అమ్మవారికి కుంకుమార్చనలు, ఆరు గంటలకు హారతులు, ఆలయ ప్రదక్షిణ, తీర్థ ప్రసాదాల వితరణ జరిగింది. భక్తులకు అసౌకర్యాలు కలుగకుండా ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఏసీ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు తెలిపారు. నిత్యం అన్నవితరణ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా గురువారం రాత్రి భక్తిరంజని, భజన, శ్రీరామాంజనేయ యుద్ధం సీను, కర్ణ సందేశం, సీతా కల్యాణం నాటకం నుంచి శివపూజ సందేశాలను కళాకారులు అద్భుతంగా ప్రదర్శించారు.

నేడు సరస్వతీదేవిగా దర్శనం

శ్రీ భ్రమరాంబ అమ్మవారు శుక్రవారం సరస్వతీదేవిగా భక్తులను అనుగ్రహించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా రాత్రి వీణా వాయిద్యం, కూచిపూడి నృత్యం, రాత్రి 8:30 గంటలకు శ్రీకనకదుర్గ అమ్మవారి మహత్యం పూర్తి నాటకం ప్రదర్శన ఉంటుందని ఏసీ శ్రీనివాసరెడ్డి తెలియజేశారు.

మంత్రి అంబటి పూజలు

గుంటూరు రూరల్: మండలంలోని చిన్నపలకలూరులో జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మల సుబ్బారావు, మిర్చి యార్డ్ డైరెక్టర్ బండలపాటి వెంకటేశ్వర్లు(ఇంద్ర) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో గురువారం రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు ఆయనకు పూర్ణకుంభంతో సాదర స్వాగతం పలికారు. అనంతరం మంత్రిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులు కోరిన కోరికలు నెరవేర్చే దేవత శ్రీ కనకదుర్గమ్మ తల్లి అని చెప్పారు. కార్యక్రమంలో భక్తులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

అమ్మవారికి వెండి ఆభరణాలు బహూకరణ

తాడేపల్లిరూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని కుంచనపల్లిలో వేంచేసి ఉన్న కాశీ విశ్వేశ్వర ఆలయంలో అన్నపూర్ణ అమ్మవారికి దాత వెండి ఆభరణాలు గురువారం బహూకరించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి అచ్చిరెడ్డి మాట్లాడుతూ 400 సంవత్సరాల చరిత్ర కలిగిన కాశీవిశ్వేశ్వర అన్నపూర్ణ అమ్మవారికి కుంచనపల్లికి చెందిన దాత కాజా వెంకటేశ్వరరావు, రమాదేవి దంపతులు అన్నపూర్ణ అమ్మవారికి వెండి కిరీటం, రెండు కర్ణభేరీలు, చటారి, వెండి పళ్లెం అందజేశారని తెలిపారు. వెండి ఆభరణాలు అందజేయడం సంతోషించదగ్గ విషయమని ఆయన పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధికి తన వంతు కృషిచేస్తానని కాజా వెంకటేశ్వరరావు హామీ ఇచ్చారు. అనంతరం దాత కాజా వెంకటేశ్వరరావు, రమాదేవి దంపతులను ఏవో సత్కరించారు. కార్యక్రమంలో కాట్రగడ్డ ఆంజనేయులు, కాట్రగడ్డ పూర్ణయ్య, కాజా పెద్ద వెంకటేశ్వరరావు, కాజా కాశీరాంబాబు, చాగంటి సాంబిరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టు నేత గంగాధరరావుకు ఘన నివాళి



పెదకాకాని: భారత కమ్యూనిస్టు పార్టీ అభ్యున్నతికి వల్లూరి గంగాధరరావు సేవలు వెలకట్టలేమని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ కొనియాడారు.పెదకాకానిలో గురువారం గంగాధరరావు 17వ వర్ధంతి సందర్భంగా ఆయన స్తూపం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమానికి పొన్నూరు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గుంటూరు జిల్లా సీపీఐ కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ మాట్లాడుతూ కామ్రేడ్ వల్లూరి గంగాధరరావు ఆలిండియా రేడియోలో పనిచేస్తూ ఆనాటి సీపీఐ పిలుపులో భాగంగా ఉద్యోగానికి రాజీనామా చేశారని తెలిపారు. కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం స్వీకరించి పెదకాకానిలో తాడిత, పీడిత ప్రజలకు అండగా నిలబడి, అనేక పర్యాయాలు గ్రామ సర్పంచిగా పని చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో గుంటూరు నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, గ్రామ కార్యదర్శి పాటిబండ్ల డేవిడ్‌రాజు, ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి, గుంటూరు కళాపరిషత్ నాయకులు పూర్ణ, గుంటూరు జిల్లా ఏఐటీయూసీ కార్యదర్శి మేడా హనుమంతరావు, రైతు సంఘం అధ్యక్షుడు కొల్లి రంగారెడ్డి, పున్నయ్య, మహిళా సమాఖ్య కార్యదర్శి రెంటాల కుమారి, వెనిగండ్ల సీపీఐ కార్యదర్శి బుల్లా బాబూరావు పాల్గొన్నారు.

గ్రావెల్ టోకెన్లు దుర్వినియోగం చేస్తే చర్యలు

కమిషనర్ కీర్తి చేకూరి



అధికారులతో సమావేశమైన కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేసేందుకు జారీ చేస్తున్న గ్రావెల్ టోకెన్లను దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు ఉంటాయని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో గురువారం జీఎంసీ ఇంజినీరింగ్, హౌసింగ్, మైనింగ్ డిపార్ట్‌మెంటు అధికారులు, ఎమినిటీ కార్యదర్శులతో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. తొలుత లే అవుట్స్ వారీగా ఇళ్ల నిర్మాణం, మౌలిక వసతులు, బిల్స్ చెల్లింపు, ఇసుక, సిమెంట్, ఇనుము లభ్యత తదితర అంశాల్ని ప్రస్తావించారు. టోకెన్ల ద్వారా వచ్చే గ్రావెల్‌ను కాంట్రాక్టర్లు జగనన్న లే అవుట్స్‌లోనే వినియోగించేలా చూడాలని, దుర్వినియోగం చేస్తే వెంటనే తమ దృష్టికి తీసుకొస్తే వారిపై పోలీసు కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. కాంట్రాక్టర్లు కూడా పనులకు అనుగుణంగా కార్మికులను సిద్ధం చేసుకొని, వేగవంతం చేయాలని ఆదేశించారు. పీఎఫ్ఎంఎస్ కోడ్ జనరేట్ కాని వారి వివరాల్ని హౌసింగ్ ఎండీ కార్యాలయంతో సంప్రదించి పరిష్కరించాలని ఈఈని ఆదేశించారు. ఇళ్ల నిర్మాణ పనుల్ని ఎప్పటికప్పుడు బిల్స్ కోసం ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఎస్ఈ భాస్కర్‌ను ఆదేశించారు. నిర్లక్ష్యంగా ఉండే కార్యదర్శులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్డీవో ప్రభాకరరెడ్డి, మైనింగ్ డీడీ. సుబ్రహ్మణ్యేశ్వరరావు, నగరపాలక సంస్థ డెప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, వెంకట కృష్ణయ్య, ఈఈలు సుందరరామిరెడ్డి, శ్రీనివాస్, హౌసింగ్ ఈఈ శంకరరావు, నగరపాలక సంస్థ, హౌసింగ్ డీఈఈలు, ఏఈలు, మైనింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ కార్మికులకు ఈఎస్ఐ కార్డుల పంపిణీ

నగర పాలక సంస్థలో విధులు నిర్వహిస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులకు గురువారం నగర మేయర్ క్యాంపు కార్యాలయంలో ఈఎస్ఐ కార్డులు అందజేశారు. గత ఆగస్టు 23, 24, 25 తేదీల్లో కార్యాలయంలో శిబిరాన్ని నిర్వహించారు. కార్మికులంతా కుటుంబ సభ్యులతో పాటు వచ్చి ఆధార్ కార్డుల్ని అప్డేట్ చేసుకున్నారు. అయితే, శిబిరానికి వచ్చిన కార్మికులు కొంతమంది ఇంత వరకు ఈఎస్ఐ కార్డులు లేవని ఇవ్వలేదని మేయర్ దృష్టికి తీసుకు వచ్చారు. ఆయన ఔట్ సోర్సింగ్ కార్పొరేషన్ సిబ్బందితో మాట్లాడారు. వారు వెంటనే స్పందించి 250 మంది పారిశుద్ధ్య, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ విభాగాలకు సంబంధించిన కార్మికులకు ఈఎస్ఐ కార్డులు మంజూరు చేశారు. కార్మికులంతా ఈఎస్ఐ వైద్య సేవలను వినియోగించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మున్సిపల్ ఇంజనీరింగ్–టౌన్ ప్లానింగ్ అండ్ శానిటేషన్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు మూడు మధుబాబు, కార్పొరేటర్ అందుగుల సంతోష్, వైఎస్సార్ సీపీ నాయకులు సాదు రాజేష్, బోగిసం ప్రసాద్ పాల్గొన్నారు.

నకిలీ పురుగు మందులు విక్రయిస్తే కఠిన చర్యలు

మంగళగిరి: నకిలీ పురుగు మందులు విక్రయిస్తే కఠిన చర్యలతోపాటు క్రిమినల్ కేసులు నమోదు చేసి దుకాణాలను సీజ్ చేస్తామని వ్యవసాయ శాఖ మంగళగిరి ఏడీఏ జి. శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. గురువారం మంగళగిరి సబ్ డివిజన్ పరిధిలోని తాడేపల్లి, మంగళగిరి, తాడికొండ, తుళ్లూరు మండలాల్లోని పురుగు మందులు, ఎరువుల దుకాణాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ పలు దుకాణాలలో తనిఖీలు నిర్వహించి నాణ్యతపై అనుమానం ఉన్న మందుల శాంపిల్స్‌ను సేకరించి పరీక్ష కేంద్రాలకు పంపినట్లు చెప్పారు. సబ్ డివిజన్ పరిధిలో 13 రకాల పురుగుమందుల శాంపిల్స్‌ను సేకరించి పరీక్ష కేంద్రాలకు పంపామని పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల ఫలితాలలో నాణ్యత లోపిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. తనిఖీలలో నాలుగు మండలాల వ్యవసాయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ మద్యం విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు



నగరంపాలెం: తెలంగాణ మద్యం సీసాలు విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు సెబ్ గుంటూరు ఎస్ఈబీ –1 స్టేషన్ సీఐ ఎం.రమేష్ తెలిపారు. బ్రాడీపేటలోని స్టేషన్‌లో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. గుంటూరు ఎస్ఈబీ –1, ఆర్పీఎఫ్ సంయుక్తంగా గురువారం ఉదయం గుంటూరు జీజీహెచ్ ప్రధాన ద్వారం వద్ద అమరావతి రోడ్డు టెలికంనగర్‌కు చెందిన పి.రామమోహనరావును, సంపత్‌నగర్‌లోని పార్వతీపురం రెండో వీధికి చెందిన కె.సురేంద్రను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టినట్లు చెప్పారు.ఈ క్రమంలో వారి నుంచి తెలంగాణకు చెందిన 83 మద్యం సీసాలను గుర్తించి, అరెస్టు చేసినట్లు సీఐ రమేష్ తెలిపారు. గుంటూరు నుంచి రైలు మార్గం ద్వారా తెలంగాణలోని నల్గొండ నుంచి సీసాలు తీసుకొచ్చి విక్రయిస్తున్నట్లు ఆయన చెప్పారు.